మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

గురువారం 22 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 320

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

# టీమిండియాకు అసలైన పరీక్ష

- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌తో పర్యటనకు భారత్ శ్రీకారం
- వెస్టిండీస్‌తో సిరీస్ సమం కావడంతో ఒత్తిడిలో జట్టు
- బౌన్స్ పిచ్‌లపై భారత బ్యాటర్లకు సవాల్
- ఓపెనర్ల శుభారంభం అందించడం అవసరం
- బౌలింగ్‌లో భువనేశ్వర్, అర్ష్‌దీప్‌లపై ఆశలు
- ఫిన్ అలెన్, కాన్వే, ఫిలిప్స్‌తో కివీస్ పటిష్టం

03

నేడు న్యూజిలాండ్‌తో తొలి టీ20 పోరు

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియాకు అసలైన పరీక్ష ఎదురుకానుంది. గురువారం ఇరు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులతో సాగే ఈ పర్యటనలో భారత్ తొలుత పొట్టి ఫార్మాట్‌లో తలపడనుంది. ఇటీవల స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను 2-2తో ముగించిన భారత జట్టుకు కివీస్ గడ్డపై సవాల్ మరింత కఠినంగా మారింది. బౌన్స్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు సత్తా చాటడంతోపాటు బౌలర్లు సమష్టిగా రాణిస్తేనే భారత్‌కు విజయావకాశాలు మెరుగవుతాయి.






03

2029 నాటికి దేశంలో డ్రగ్స్
## నిర్మూలనే లక్ష్యం

- మాదకద్రవ్యాలపై దేశవ్యాప్త ఉద్యమానికి అమిత్ షా శ్రీకారం
- 2029 డిసెంబర్ 31లోగా డ్రగ్స్ ముప్పును అంతం చేయాలని పిలుపు
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో నివాళులు
- న్యూఢిల్లీలో బైక్ ర్యాలీని ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి
- ర్యాలీలో పాల్గొన్న సుమారు 90 మంది పోలీసు బైక్ రైడర్లు
- కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, దర్యాప్తు సంస్థల భాగస్వామ్యం
- ప్రజల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన పెంపునకు ప్రచారం

# 'చెప్పాం.. చేస్తున్నాం



## స్థానిక ఎన్నికలకు చంద్రబాబు కొత్త నినాదం!

- హామీల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు
- కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- జనసేన, బీజేపీలతో సమన్వయానికి ప్రాధాన్యం
- సీట్ల సర్దుబాటును సామరస్యంగా పూర్తి చేయాలి
- రెబల్ అభ్యర్థులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే సస్పెన్షన్ వేటు
- టికెట్లు దక్కని వారికి నామినేటెడ్ పదవుల హామీ
- స్థానిక ఎన్నికలపై టీడీపీ ముఖ్య నేతలకు సీఎం దిశానిర్దేశం

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. 'చెప్పాం.. చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని నేతలకు పిలుపునిచ్చారు. కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ మిత్రధర్మాన్ని పాటించాలని సూచించారు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి రెబల్స్‌గా నామినేషన్లు వేస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. టికెట్లు దక్కని నేతలకు భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు కల్పిస్తామని భరోసా ఇస్తూనే, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

**అమరావతి, ఏపీ బ్యూరో,**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ సమాయత్తమవుతోంది. ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీలతో సమన్వయంపై దిశానిర్దేశం చేశారు. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే రెబల్ అభ్యర్థులపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని

-మిగతా 3 లో




## వైసీపీకి షాక్.

- టీడీపీలో చేరిన రజనీకాంత్
- మంత్రి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిక
- మద్దతుదారులతో కలిసి పార్టీ మారిన వైసీపీ సీనియర్ నేత
- రజనీకాంత్‌తో పాటు టీడీపీలో చేరిన 25 కుటుంబాలు
- స్థానిక ఎన్నికల్లో మెజార్టీ పెంచుకోవాలని లోకేశ్ పిలుపు
- మంగళగిరిలో అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశం
- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని లోకేశ్ భరోసా

**మంగళగిరి,**

మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా వైసీపీ సీనియర్ నేత, గుంటూరు పార్లమెంట్ వైసీపీ ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్ తన మద్దతుదారులతో కలిసి టీడీపీలో చేరారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనతో పాటు మరో 25 కుటుంబాలకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న స్థానిక

-మిగతా 3 లో

## ఢిల్లీలో క్షీణించిన వాయు నాణ్యత

03



03

## మొదటి టార్గెట్ సల్మాన్ ఖాన్!

- టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసులో పోలీసుల దర్యాప్తు
- తొలుత సల్మాన్ ఇంటి వద్ద నిందితుల రెక్కీ
- భద్రత ఉండటంతో లక్ష్యాన్ని మార్చుకున్నట్లు సమాచారం
- ఫుట్‌బాల్ మైదానంలో టైగర్‌పై కాల్పులకు తెగింపు
- సోషల్ మీడియా ద్వారా నటుడి కదలికలపై ఆరా
- సల్మాన్‌తో పనిచేసేవారికి నిందితుల హెచ్చరిక
- ముంబై సినీ పరిశ్రమలో కలకలం
- నిందితుల కదలికలపై పోలీసుల దర్యాప్తు



## సుప్రీం ఆదేశాలు మాకు బూస్ట్ ఇచ్చాయి.

- 19 మున్సిపాలిటీల్లో విజయం సాధిస్తామన్న పెద్దిరెడ్డి
- నామినేషన్ల సమయంలో అభ్యర్థులకు ఇబ్బందులు కలిగించారని ఆరోపణ
- నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని వైసీపీ నేత విమర్శ
- వాహనాల ధ్వంసం, గందరగోళం సృష్టించారని ఆరోపణలు
- టీడీపీ నేతలకు పోలీసులు సహకరించారంటూ విమర్శ
- వైసీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం
- మిథున్ రెడ్డిపై ఐదు కేసులు నమోదు చేశారని వెల్లడి
- ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించి భద్రత కల్పించాలని డిమాండ్

**అమరావతి, ఏపీ బ్యూరో,**

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తమ పార్టీకి ఎంతో బూస్ట్ ఇచ్చాయని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ తీర్పు నేపథ్యంలో 19 మున్సిపాలిటీ లలో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసి గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ...**

నామినేషన్ల ప్రక్రియలో వైసీపీ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. తమ వారిని నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, గందరగోళం సృష్టించడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి

-మిగతా 3 లో



03

శత్రు శక్తులను ఓడించేందుకు
## ఏకం కావాలి!

- దేశ ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యంగా పనిచేయాలి
- దేశ భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై సమష్టి పోరాటం
- ఢిల్లీలో విజయదశమి వేడుకల్లో ప్రధాని మోదీ పిలుపు
- సుపరిపాలనకు ఆదర్శమని వ్యాఖ్య
- ప్రజలకు న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే పాలన లక్ష్యం
- ధర్మం, న్యాయం, ఐక్యతను చాటే విజయదశమి
- స్వయం సమృద్ధ భారత్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- దేశ వనరులు, సామర్థ్యాలపై ప్రజలకు విశ్వాసం ఉండాలి

## ఎస్‌బీఐ యూజర్ల డాటా లీక్




03

పుర పోరుకు
# బ్రేక్!

సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం

- నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారంటూ వైసీపీ పిటిషన్
- అభ్యర్థుల ఫిర్యాదులు, ఆధారాలను పరిశీలించాలని ఆదేశం
- అక్టోబర్ 22లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీకి సూచన
- తుది అభ్యర్థుల జాబితా ప్రచురణకు తాత్కాలికంగా అడ్డుకట్ట
- నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కూడా నిలిపివేత
- పారదర్శక ఎన్నికలు ప్రజాస్వామ్యానికి కీలకమన్న సుప్రీంకోర్టు
- అక్టోబర్ 25న తుది జాబితా విడుదల చేయాలని సూచన

**అమరావతి,**

: ఆంధ్రప్రదేశ్‌లోని 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ తాత్కాలికంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికార పక్షం వేధింపుల కారణంగా తమ పార్టీ అభ్యర్థులు పలుచోట్ల నామినేషన్లు దాఖలు చేయలేకపోయారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని పేర్కొంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ల గడువును పొడిగించడంతో పాటు అభ్యర్థులకు

-మిగతా 3 లో



# తుది దశలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

**గత ఒప్పందాలకు ఇది భిన్నం: ట్రంప్**



**న్యూఢిల్లీ: అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే దశకు చేరుకున్నాయని, ఈ ఒప్పందం గతంలో కుదుర్చుకున్నవాటి కంటే భిన్నంగా ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. మంగళవారం ఓవల్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడం పట్ల రెండు దేశాలు ఆసక్తిగా ఉన్నాయని అన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారతదేశ పర్యటనకు వచ్చిన తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో పంజాబ్ సీఎం నిలిపివేత

**ఇది కేంద్రం వేధింపులేనని ఆప్ ఆరోపణ**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
పారిస్‌లోని ఫుడ్ ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొని మంగళవారం రాత్రి ఢిల్లీకి వచ్చిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు ఢిల్లీ విమానాశ్రయంలో వేధింపులు ఎదురయ్యాయి. ఆయనను అధికారులు మూడు గంటల పాటు నిర్బంధించడమే కాక, ఏవో కారణాలతో ఆయనకు 50 వేల రూపాయల జరిమానా కూడా విధించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడి కారణంగానే తామీ చర్యకు పాల్పడినట్టు ఆయనకు తెలిపారు. 'రావణుడి అహంకారం దసరా దినంతో అంతమైపోయింది. కేంద్ర ప్రభుత్వ అహంకారం కూడా తప్పక అంతం అవుతుంది' అని ఢిల్లీ మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. విదేశీ పర్యటనకు కేంద్రం నిరాకరించినా కోర్టు అనుమతితో మాన్ పారిస్ వెళ్లి వచ్చినందునే కక్షతో కేంద్రం ఈ అరాచకానికి పాల్పడిందని ఆప్ ఆరోపించింది.

# గాయపడిన సైనికుడిని డ్రోన్‌తో తరలింపు

**ప్రపంచంలోనే తొలిసారిగా ఉక్రెయిన్‌లో**



**కీవ్: అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
గాయపడిన సైనికుడి ప్రాణాలను కాపాడేందుకు ప్రపంచంలోనే తొలిసారిగా డ్రోన్‌ను ఉపయోగించారు. ఉక్రెయిన్ జవాన్ కొస్టియన్‌టిన్ వ్లాసెంకో 491 రోజులుగా సరిహద్దులోని ఫ్రంట్ లైన్‌లో చిక్కుకుపోయాడు. అతడి చుట్టూ రష్యా బలగాల ముప్పు పొంచి ఉంది. భూమి లోపల మందుపాతరలు ఉండటం, గగనతలంలో డ్రోన్లు చక్కర్లు కొడుతుండటంతో అతడు సులభంగా తప్పించుకోలేపోయాడు. సహాయ బృందాలు అతడిని చేరుకోలేకపోయాయి. ఈ పరిస్థితుల్లో అతడిని రక్షించడానికి ఒక డ్రోన్‌ను ఉపయోగించారు. గర్డ్జఫ్ డిఫెన్స్ ఉచితంగా వాడుకొమ్మని ఇచ్చిన డ్రోన్‌కు ఉన్న ప్రత్యేక బెల్ట్ సాయంతో అతడిని రక్షించారు. ఈ ఆపరేషన్ జరుగుతున్న సమయంలో గాయపడిన సైనికుడు డ్రోన్ ఆపరేటర్‌తో మాట్లాడుతూ అతడి సూచనలను పాటించాడు. రష్యాతో నాలుగేండ్లుగా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఏటా 10 లక్షల చవకైన డ్రోన్లను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని ఉక్రెయిన్ పెంచుకొన్నది. మరోవైపు ఉక్రెయిన్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు లక్ష్యంగా రష్యా దాడులు కొనసాగిస్తున్నది. యుద్ధం ముగించేందుకు ఒక ఒప్పందానికి రావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌ను కోరారు. రష్యా డ్రోన్, క్షిపణి దాడులను ఎదుర్కోవడానికి అమెరికా నుంచి ఉక్రెయిన్ సైనిక సాయం కోరుతున్నది.

# క్రెడిట్ కార్డు చెల్లింపులు ఆలస్యమైనా చార్జీల్లేవ్

**యూజర్లకు ఆర్బీఐ ఊరట**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
క్రెడిట్ కార్డుదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గొప్ప ఊరటనిచ్చింది. చెల్లింపులు ఆలస్యమైనా చార్జీలు పడకుండా కొత్త నిబంధనల్ని తెచ్చింది. సవరించిన రూల్స్ ప్రకారం.. గడువు తేదీ 2-3 రోజులు దాటినా ఓవర్‌డ్యూగా పరిగణించబడదు.

# సీజేపీ నేతలు సౌరవ్, రాంకా విడుదల

**-వారంపాటు తీహార్ జైల్లో ఉన్న నేతలు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
జంతర్ మంతర్ వద్ద ఈనెల 14న నిరసన తెలిపిన తర్వాత నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను విడుదల చేయాలని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్(ఎస్ఈఎం) బుధవారం ఆదేశించారు. తమ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వారు ఉపసంహరించుకున్న కొన్ని గంటల్లో విడుదల ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతరం బుధవారం రాత్రి వారు తీహార్ జైలు నుంచి విడుదల య్యారు. వారి కస్టడీ గడువు ముగియనున్న నేపథ్యంలో బుధవారం వారిద్దరినీ ఎస్ఈఎం ముందు హాజరుపరిచారు. నిరసన ప్రదేశంగా గుర్తింపును రద్దు చేసిన జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడంతోపాటు శాంతి ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న దాస్, రాంకాలను ఈనెల 14న ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఈనెల 19న వారి కస్టడీ కాలాన్ని మరో రెండు రోజులు పొడిగించారు.

**మీరు జెన్‌జీ కాదన్నమాట!**
ఢిల్లీ హైకోర్టులో సోమవారం విచారణ సందర్భంగా సరదా సంభాషణ చోటుచేసుకుంది. విచారణ సందర్భంగా సౌరవ్, రాంకా తరఫున హాజరైన న్యాయవాది అభిక్ చిమ్నీని ఆ ఇద్దరు నేతల వయస్సు ఎంత అని జస్టిస్ ప్రసాద్ అడిగారు. దాస్ వయస్సు 27 ఏండ్లు, రాంకా వయస్సు 32 ఏండ్లు అని చిమ్నీ కోర్టుకు తెలిపారు. అయితే మీరు జెన్‌జీ కాదు. అసలు జెన్‌జీ అంటే ఏమిటి? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. సాధారణంగా 1997 తర్వాత జన్మించిన వారిని జెన్‌జీ అని పిలుస్తారని న్యాయవాది తెలియచేయగా అయితే మీరు జెన్‌జీ కాదు అని జస్టిస్ ప్రసాద్ పునరుద్ఘాటించారు.

**ఫ్రాన్స్ అల్లర్లను ప్రస్తావించిన కోర్టు**
సీజేపీ నేతలు సౌరవ్, రాంకా అరెస్టుకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు ఫ్రాన్స్‌లో జరుగుతున్న విద్యార్థుల నిరసనలను ప్రస్తావించింది. విద్యార్థుల ఆందోళనలుగా ప్రారంభమైన నిరసనలు చివరకు నిప్పంటించడం, దోపిడీకి దారితీశాయని వ్యాఖ్యానించింది. నిరసనలకు పోలీసుల అనుమతి తీసుకోవడం కేవలం ఆందోళనకారులను అడ్డుకోవడానికి మాత్రమే కాదని, ఇతరులు చేరి పరిస్థితులను దిగజార్చకుండా నిరోధించడానికి కూడా అని పేర్కొన్నది.

# ఎన్‌డీయేలో చేరిక.. ప్లాట్ కానుక

**ఇంటిపక్క భూమిని యూసుఫ్‌కి కేటాయించిన గుజరాత్ ప్రభుత్వం**



**న్యూఢిల్లీ అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
అక్టోబర్ 21: క్రికెటర్ నుంచి రాజకీయ నేతగా మారి, సొంత పార్టీకే వెన్నుపోటు పొడిచి, బీజేపీ పంచన చేరిన యూసుఫ్ పఠాన్‌కు గుజరాత్ ప్రభుత్వం నుంచి గొప్ప బహుమతి లభించింది. తన ఇంటిని ఆనుకుని, 2012 నుంచి దానికోసం న్యాయ, పరిపాలనాపరమైన పోరాటం చేస్తున్న పఠాన్‌కు ఆ భూమిలోని సగాన్ని ప్రభుత్వం బహుమతిగా అందజేసింది. వెయ్యి చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ ప్లాట్ పఠాన్ కుటుంబం నివసిస్తున్న వడోదరలో అతని ఇంటిని ఆనుకునే ఉంది. క్రికెటర్‌గా ఉన్నప్పుడు సెక్యూరిటీ కారణాలు చూపుతూ ఆ ప్లాట్ స్వాధీనానికి ఆయన దరఖాస్తు చేసుకున్నాడు. బెర్హంపూర్ ఎంపీ పఠాన్ తమ పార్టీలో చేరినందుకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని బీజేపీ ప్రభుత్వం భావించిందో, మరే కారణమో కానీ, ఆ స్థలంలో సగాన్ని గుజరాత్ ప్రభుత్వం బహుమతిగా ఇచ్చింది. మిగిలిన సగాన్ని మార్కెట్ విలువలో 55 శాతానికి కేటాయించేలా నిర్ణయించారు.

# నిరసనకారులపై బలప్రయోగాన్ని మానుకోవాలి

**భారత్‌ను కోరిన యూఎన్ నిపుణులు**



**న్యూఢిల్లీ: అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
భారతదేశంలో ఇటీవలి నిరసనల అణచివేత సందర్భంగా అధికారుల తీరుపై స్వతంత్ర దర్యాప్తు జరుగాలని మంగళవారం ఐక్యరాజ్యసమితి(యూఎన్) నిపుణులు కోరారు. ఈ ఆందోళనల్లో ప్రదర్శనకారులు గాయపడ్డారని, తమతో దౌర్జన్యంగా వ్యవహరించారని కొందరు తెలిపారని వారు పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీకి అనుకూలంగా ఓటర్ల జాబితాను సవరించారంటూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఇటీవల భారతదేశంలో నిరసనలు చేపట్టాయి. 'సమావేశాలు శాంతియుతంగా జరిగినప్పటికీ, నిరాయుధులైన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారు. వేలాది మంది నిరసనల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారు' అని రెండు డజన్ల స్వతంత్ర నిపుణులు ఒక ప్రకటనలో తెలిపారు. 'అధికారులు తక్షణమే అధిక బలప్రయోగాన్ని ఆపాలని, సమావేశాలపై నిషేధాలను రద్దు చేయాలని, బయోమెట్రిక్స్, ఇంటర్నెట్ అంతరాయాలతో సహా డిజిటల్ నిఘా దుర్వినియోగాన్ని నిలిపివేయాలని మేము కోరుతున్నాము' అని వారు పేర్కొన్నారు.

**పిల్లలు విధ్వంసానికి పాల్పడితే,తల్లిదండ్రులు**

# పరిహారం చెల్లించాలి!

**ఇటలీ ప్రభుత్వం కొత్త నిబంధన**



**కైరో అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
ఇటలీలో నిరసనలు వెల్లువెత్తడంతో వాటిని అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. అల్లర్లకు పాల్పడేవారికి శిక్షలు పెంచడంతోపాటు, మైనర్లుగా ఉన్న తమ పిల్లలు నిరసనల సమయంలో విధ్వంసం, దోపిడీలకు పాల్పడితే వారి తల్లిదండ్రులపైన ఆర్థిక బాధ్యత విధించే నిబంధనను తీసుకొచ్చింది. ఇటలీలోని ఉత్తర ప్రాంతాల్లో ముఖ్యంగా మిలాన్‌లో గత వారాంతంలో హింసాత్మక నిరసనలు జరిగాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఇటలీ ప్రభుత్వం కొత్త భద్రతా చర్యలకు ఆమోదం తెలిపింది. నిరసనలు తెలపడం హక్కు.. కానీ నగరాలను తగులబెట్టడం హక్కు కాదు అని ప్రధాని మెలోనీ స్పష్టంచేశారు. కొత్త డిక్రీ వెంటనే అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం నిరసనల సమయంలో జరిగిన ఆస్తి నష్టానికి బాధ్యుల నుంచి పరిహారం వసూలు చేయవచ్చు. నష్టానికి కారణమైన వ్యక్తి మైనర్ అయితే, వారి తల్లిదండ్రులు ఆ పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

# ట్రంప్ పాలనలో 3 లక్షల వీసాల రద్దు




**వాషింగ్టన్: అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
డొనాల్డ్ ట్రంప్ రెండో దఫా పాలనలో 3 లక్షల యూఎస్ వీసాలను రద్దు చేసినట్టు ఆయన అధికార యంత్రాంగం మంగళవారం తెలిపింది. వలసలపై కఠిన విధానం కొనసాగిస్తామని స్టేట్ డిపార్ట్‌మెంట్ స్పష్టం చేసింది. కొన్ని నెలలుగా వీసాల రద్దు వేగవంతమైనట్టు వాటి సంఖ్య సూచిస్తున్నది. దేశ భద్రతను మెరుగు పరచడమే లక్ష్యంగా వలసదారుల అణచివేత, బహిష్కరణను కొనసాగిస్తున్నామని ట్రంప్ చెప్తుండగా.. ఈ అణచివేత చట్టబద్ధ ప్రక్రియను, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కులను ఉల్లంఘించిందని, మైనారిటీల్లో అభదత్రను కలిగించిందని హక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన పాలస్తీనా అనుకూలురైన వారివీసాలను ఎక్కువగా రద్దు చేశారని వారు ఆరోపించారు.

# కూలిన మిరేజ్-2000డీ యుద్ధ విమానం.

**పారిస్ అక్టోబర్ 21: డ్రీమ్స్ టైమ్స్**
ఫ్రాన్స్‌లో మిరేజ్ 2000డీ(వీఱత్ఖుస్త్రవ 2000ఐ) యుద్ధ విమానం కూలింది. ఎయిర్‌బేస్‌కు సమీపిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో విమాన సిబ్బంది ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తి ఆచూకీ లేరు. రాత్రి పూట శిక్షణ జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. నాన్సీ పట్టణానికి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న రోజీవిల్లే ఎయిర్‌బేస్‌లో యుద్ధ విమానం కూలింది. మిరేజ్ విమానానికి చెందిన ఓ పైలట్ మృతదేహాన్ని రికవరీ చేసినట్లు ఫ్రాన్స్ సైనిక దళాలు కన్ఫర్మ్ చేశాయి. రెండో సభ్యుడి కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ దుర్ఘటన పట్ల దర్యాప్తు కూడా జరుగుతున్నట్లు ఫ్రెంచ్ వైమానిక, స్పేస్ ఫోర్స్ పేర్కొన్నది. మిరేజ్-2000డీ రెండు సీట్ల యుద్ధ విమానం. గ్రౌండ్ అటాక్ మిషన్లకు వాడుతుంటారు. సంక్లిష్టమైన వాతావరణంలోనూ పనిచేసే రీతిలో దీన్ని డిజైన్ చేశారు. సంప్రదాయ ఎయిర్ ఆపరేషన్స్‌తో పాటు పవర్ ప్రొజెక్షన్ మిషన్స్‌లో ఈ యుద్ధ విమానం పాల్గొంటుంది.



# కివీస్ గడ్డపై టీమిండియాకు కఠిన పరీక్ష!

-నేడు న్యూజిలాండ్‌తో తొలి టీ20 పోరు
-ఐదు మ్యాచ్‌ల సిరీస్‌తో పర్యటనకు భారత్ శ్రీకారం
-వెస్టిండీస్‌తో సిరీస్ సమం కావడంతో ఒత్తిడిలో జట్టు
-బౌన్స్ పిచ్‌లపై భారత బ్యాటర్లకు సవాల్
-ఓపెనర్లు శుభారంభం అందించడం అవసరం
-బౌలింగ్‌లో భువనేశ్వర్, అర్ష్‌దీప్‌లపై ఆశలు
-ఫిన్ అలెన్, కాన్వే, ఫిలిప్స్‌తో కివీస్ పటిష్ఠం




న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియాకు తొలి సవాల్ ఎదురుకానుంది. గురువారం ఇరు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ పర్యటనలో భారత్ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. తొలుత టీ20 సిరీస్‌తో పోరు ప్రారంభం కానుంది. ఇటీవల స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 2-2తో సమం చేసుకుంది. ఈ నేపథ్యంలో కివీస్ గడ్డపై భారత జట్టు ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. న్యూజిలాండ్ పిచ్‌లు బౌన్స్‌కు అనుకూలంగా ఉండటంతో భారత బ్యాటర్లకు పరీక్ష ఎదురుకానుంది. స్వదేశంలోనే వెస్టిండీస్ నుంచి గట్టి పోటీ ఎదురైన నేపథ్యంలో విదేశీ గడ్డపై మరింత అప్రమత్తంగా ఆడాల్సిన అవసరం ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణిస్తేనే భారత్‌కు విజయావకాశాలు మెరుగవుతాయి. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలోనూ తనదైన ముద్ర వేయాల్సి ఉంది. ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ జట్టుకు శుభారంభం అందించాలి. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్ కూడా కీలక ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. బౌలింగ్‌లో భువనేశ్వర్ రాకతో జట్టుకు బలం చేకూరనుంది. అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ వికెట్లు తీయడంపై భారత్ ఆశలు పెట్టుకుంది. మరోవైపు స్వదేశంలో ఆడుతున్న న్యూజిలాండ్ జట్టు కూడా పటిష్ఠంగా ఉంది. ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే, గ్లెన్ ఫిలిప్స్, డారిల్ మిచెల్, బ్రేస్‌వెల్‌తో పాటు కెప్టెన్ సాంటీర్ జట్టుకు కీలకం కానున్నారు. వీరిని కట్టడి చేయడంతో పాటు ప్రత్యర్థి పిచ్‌లపై పరిస్థితులకు అనుగుణంగా ఆడటం టీమిండియాకు ప్రధాన పరీక్షగా నిలవనుంది.

# 2029 నాటికి దేశంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యం



న్యూఢిల్లీ

2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో మాదకద్రవ్యాల ముప్పును నిర్మూలించేందుకు సమష్టిగా, నిరంతరంగా పోరాడాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. బుధవారం న్యూఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక స్థూపం వద్ద నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొన్న ఆయన.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం దేశవ్యాప్త మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించారు. నిర్దేశించిన గడువులోగా దేశం నుంచి మాదకద్రవ్యాల మహమ్మారిని తొలగించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అమిత్ షా సూచించారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగంగా న్యూఢిల్లీలో సుమారు 90 మంది పోలీసు బైక్ రైడర్లతో కూడిన ర్యాలీని అమిత్ షా జెండా ఊపి ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ, ఎన్ఎస్‌జీతో పాటు ఆర్‌ఓఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐఏ సంస్థల ప్రతినిధులు కూడా ఉద్యమంలో భాగస్వాములయ్యారు. 'డ్రగ్స్‌పై పోరాటం' నినాదంతో సాగుతున్న ఈ ర్యాలీలో పాల్గొనే బైక్ రైడర్లు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర బలగాల నుంచి గుజరాత్‌లోని ఏక్తా నగర్‌కు చేరుకోనున్నారు. అక్కడ అక్టోబర్ 31న నిర్వహించనున్న ఏక్తా పరేడ్-2026లో పాల్గొంటారు. మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ప్రజలను చైతన్యవంతం చేయడం, వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని కేంద్రం పేర్కొంది.

# మొదటి టార్గెట్ సల్మాన్ ఖాన్!



ముంబై

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై ఇటీవల కాల్పులకు పాల్పడిన ముగ్గురు నిందితులు తొలుత నటుడు సల్మాన్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు విశ్వసనీయ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం సల్మాన్ నివాసం వద్ద రెక్కీ నిర్వహించినట్లు తెలిపాయి. అయితే అక్కడ పోలీసు భద్రత ఉండటాన్ని గమనించిన నిందితులు తమ ప్రణాళికను మార్చుకుని టైగర్ ష్రాఫ్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. టైగర్ ష్రాఫ్ ప్రతి ఆదివారం జుహులోని ఓ ఫుట్‌బాల్ మైదానానికి వెళ్తాడనే విషయాన్ని నిందితులు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఆ మైదానం వద్ద భద్రత పరిమితంగా ఉంటుందని భావించి, అక్కడే అతడిపై కాల్పులకు తెగబడినట్లు వెల్లడించాయి. కాల్పుల అనంతరం నిందితులు సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టు పెట్టి హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేయొద్దని తాము చేసిన హెచ్చరికలను ముంబై సినీ పరిశ్రమలో ఎవరైనా పట్టించుకోకపోతే వారే తమ తదుపరి లక్ష్యమని అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో బాలీవుడ్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. కాల్పుల ఘటన వెనుక ఉన్న కారణాలు, నిందితుల కదలికలు, వారు చేసిన హెచ్చరికలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

# ఢిల్లీలో క్షీణించిన వాయు నాణ్యత జీఆర్‌ఏపీ-1 ఆంక్షలు అమలు

న్యూఢిల్లీ:

ఢిల్లీ కాలానుగుణ కాలుష్య నియంత్రణ చర్యల్లో మొదటి దశ బుధవారం తొలిసారి ప్రారంభమైంది. ఎన్‌సీఆర్ ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ మొదటి దశను విధించారు. దసరా ఉత్సవాల తర్వాత బుధవారం వాయు నాణ్యత సూచిక 245 పాయింట్లుగా నమోదైంది. జీఆర్‌ఏపీ మొదటి దశలో భాగంగా హోటళ్లలో బొగ్గు, వంట చెరకును ఇంధనంగా ఉపయోగించడంపై నిషేధం అమలవుతుంది. అత్యవసర సందర్భాల్లో డీజిల్ జనరేటర్లను మాత్రమే వాడాలి.

# 'చెప్పాం..చేస్తున్నాం

మొదటి తరువాయి



చంద్రబాబు గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు పొందేందుకు కృషి చేయాలని నేతలకు సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో విజయం సాధించేలా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కూటమిలోని జనసేన, బీజేపీ నేతలతో పూర్తి సమన్వయం పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానికంగా సీట్ల సర్దుబాటు ప్రక్రియను ఎలాంటి విభేదాలకు తావులేకుండా సామరస్యపూర్వకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిత్రధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, కూటమి భాగస్వామ్య పార్టీలకు కేటాయించిన స్థానాల్లోనూ రెబల్ అభ్యర్థులు బరిలోకి దిగకుండా చూడాలని పేర్కొన్నారు. టికెట్లు ఆశించి దక్కించుకోలేకపోయిన నేతలకు భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల ద్వారా అవకాశం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే, పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే నామినేషన్లు వేసినవారు వాటిని ఉపసంహరించుకోవాలని, లేకపోతే పార్టీ నుంచి సస్పెన్షన్ తప్పదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేసే మంచి అభ్యర్థులను ఎంపిక చేయాలని, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల వ్యూహాలను రూపొందించాలని నేతలకు చంద్రబాబు సూచించారు. కూటమి పార్టీల మధ్య ఐక్యత, పార్టీ శ్రేణుల సమష్టి కృషితో స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# వైసీపీకి షాక్.

మొదటి తరువాయి




సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీ శ్రేణులు పనిచేయాలని ఈ సందర్భంగా లోకేశ్ సూచించారు. 2024 సార్వత్రిక ఎన్నికల కంటే స్థానిక ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని, ఎన్డీయే కూటమిగా ఐక్యంగా ఉండటం ద్వారా అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనతో పాటు తన రెండున్నరేళ్ల పనితీరును బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని లోకేశ్ కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, ఆసుపత్రి, కమ్యూనిటీ భవనాలు, పార్కులు సహా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొంటూ, వాటి వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ నిరంతరం పనిచేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎంపీపీ రజనీకాంత్‌తో పాటు చిలువూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ యాళ్ల జయలక్ష్మి, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుప్రీం ఆదేశాలు మాకు బూస్ట్ ఇచ్చాయి.

మొదటి తరువాయి

చర్యలకు పాల్పడ్డారని అన్నారు. అదే సమయంలో టీడీపీ నేతలు సులభంగా నామినేషన్లు వేసేందుకు పోలీసులు సహకరించారని విమర్శించారు.

**పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ**

పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైసీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసి, నోటీసులు జారీ చేస్తున్నారని పెద్దిరెడ్డి ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డిని ఐదు కేసుల్లో ఏ-1గా చేర్చారని ఆయన తెలిపారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కేసులు పెట్టినా తమ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు జోక్యంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించి, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



# భవిష్యత్తులో తెలంగాణకు బీసీ సీఎం

-బీసీ నేత ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువూ లేదు
-2039 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ధీమా
-రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అయినా అభ్యంతరం లేదు
-రాహుల్ గాంధీ ఆలోచనే బీసీ సీఎం నినాదం
-ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చాం
-బీఆర్ఎస్ బీసీని సీఎంను చేయగలదా?
-రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదన్న టీపీసీసీ చీఫ్



తెలంగాణ బ్యూరో,

తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేష్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేష్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

# శత్రు శక్తులను ఓడించేందుకు ఏకం కావాలి!

న్యూఢిల్లీ:

దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని సంస్థలు, రాజకీయ పార్టీలు ఏకమై పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశానికి ముప్పు కలిగించే శక్తులను ఎదుర్కొనేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాజకీయ పార్టీలన్నీ ముందుకు సాగాలని సూచించారు. ఢిల్లీలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో పాల్గొన్న ఆయన, దేశ సమగ్రత, భద్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో పనిచేయాలని అన్నారు. భారతమాతకు శత్రువులుగా నిలిచే శక్తులను గుర్తించి, వాటిని ఓడించేందుకు ఐక్యంగా కృషి చేయాలని పౌరులకు పిలుపునిచ్చారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి, సమాజంలో ధర్మం, న్యాయం, ఐక్యతలను బలోపేతం చేయాలనే సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. దసరా పండుగ అందించే స్ఫూర్తి భారతీయ తాత్విక చింతనలో అంతర్భాగమని వివరించారు. రామరాజ్యం నేటికీ సుపరిపాలనకు ఆదర్శంగా నిలుస్తోందని మోదీ అన్నారు. రామరాజ్యంలో ఎవరి పట్లా వివక్ష ఉండదని, ప్రతి ఒక్కరికీ న్యాయం, సమాన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అధికారం అంటే కేవలం పాలించడం మాత్రమే కాదని, ప్రజల సంక్షేమాన్ని నిర్ధారించడమే నిజమైన పాలన అని శ్రీరాముడి ఆదర్శాలను ప్రస్తావించారు. భారత్‌ను స్వయం సమృద్ధ దేశంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు. దేశంలోని వనరులు, సామర్థ్యాలపై ప్రజలు పూర్తి విశ్వాసం కలిగి ఉండాలని సూచించారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూ, ఐక్యతతో అభివృద్ధి పథంలో ముందుకు సాగినప్పుడే బలమైన, స్వావలంబన కలిగిన భారత్‌ను నిర్మించగలమని పిలుపునిచ్చారు.

# ఎస్‌బీఐ యూజర్ల డాటా లీక్

సైబర్ దాడి నిజమేనన్న బ్యాంక్
3,897 మంది ఖాతాదారుల వివరాలు డార్క్‌వెబ్‌లో బహిర్గతం

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)పై సైబర్ దాడి జరిగినట్టు యాజమాన్యం అంగీకరించింది. హ్యాకర్లు బ్యాంక్‌నకు చెందిన వినియోగదారులు రికార్డులను యాక్సెస్ చేసినట్టు తెలిపింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో 3,897 మంది వినియోగదారుల వ్యక్తిగత వివరాలు డార్క్‌వెబ్‌లో బహిర్గతమై ఉండవచ్చునని వెల్లడించింది. ఈ ఘటన కారణంగా బ్యాంక్ ప్రధాన కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు, వ్యాపార లావాదేవీలపై ఎలాంటి గణనీయమైన ప్రభావం పడలేదని వివరించింది. వినియోగదారుల ఖాతాల డాటా లీక్ గురించి ఈ నెల 16న తమ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్ సీఈఆర్‌టీ-ఇన్ నుంచి తమకు హెచ్చరిక అందిందని ఎస్‌బీఐ తెలిపింది.

# పుర పోరుకు బ్రేక్!

మొదటి తరువాయి

తగిన రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ మౌలిక సూత్రమని స్పష్టం చేసింది. వైసీపీ చేసిన ఫిర్యాదులను, సమర్పించిన ఆధారాలను ఒక్కొక్క కేసు వారీగా పరిశీలించి అక్టోబర్ 22లోగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అప్పటివరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని సూచించింది. అక్టోబర్ 25న తుది జాబితాను విడుదల చేయాలని పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాలను పూర్తిగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం తన ప్రకటనలో వెల్లడించింది. ఫిర్యాదులు, ఆధారాల పరిశీలన అనంతరం ఎన్నికల ప్రక్రియపై ఎస్ఈసీ తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

## సంపాదకీయం

# రూపాయి వాణిజ్యంతో భారత్ కొత్త వ్యూహం



ప్రపంచ వాణిజ్యంలో అమెరికన్ డాలర్ ఆధిపత్యం కొనసాగుతున్న వేళ భారత్ రూపాయి లేదా స్థానిక కరెన్సీల్లో వాణిజ్య చెల్లింపులను విస్తరించే వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్తోంది. విదేశీ మారకద్రవ్య కొరతను ఎదుర్కొంటున్న భాగస్వామ్య దేశాలతో స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం కొనసాగించడం ద్వారా వాటికి అవసరమైన దిగుమతులు అందుబాటులో ఉంచడంతో పాటు, అంతర్జాతీయ వాణిజ్యంలో రూపాయి వినియోగాన్ని పెంచడం దీని ప్రధాన ఉద్దేశం. ఇది డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడం, రూపాయిని అంతర్జాతీయకరించడం, భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలతో ముడిపడి ఉంది. సాధారణంగా అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ వంటి బలమైన కరెన్సీలను మధ్యవర్తి కరెన్సీగా ఉపయోగిస్తారు. అయితే విదేశీ మారకద్రవ్య నిల్వలు తగ్గిపోయిన దేశాలకు డాలర్లను సమకూర్చుకోవడం కష్టమవుతుంది. ఫలితంగా అవసరమైన వస్తువులు కొనుగోలు చేయాలన్నా దిగుమతులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో భారత్ రూపాయి లేదా భాగస్వామ్య దేశాల స్థానిక కరెన్సీల్లో చెల్లింపులు చేసుకునే అవకాశాన్ని అందించడం ద్వారా ప్రత్యామ్నాయ మార్గాన్ని అందిస్తోంది. అయితే దీని అర్థం డాలర్ అవసరం పూర్తిగా తగ్గిపోతుందని కాదు. చమురు, ముడి పదార్థాలు, సాంకేతిక పరికరాలు వంటి కీలక దిగుమతులకు భారత్‌కు ఇప్పటికీ డాలర్ అవసరం ఉంది. అందువల్ల లక్ష్యం డాలర్‌ను తోసిపుచ్చడం కంటే, ఒకే కరెన్సీపై అధిక ఆధారపడకుండా ప్రత్యామ్నాయ చెల్లింపు మార్గాలను పెంచుకోవడం. రూపాయి అంతర్జాతీయకరణ ఈ వ్యూహంలో మరో కీలక అంశం. ఇతర దేశాలు భారత్ వాణిజ్యంలో రూపాయిని స్వీకరించడం పెరిగితే, దాని అంతర్జాతీయ వినియోగం విస్తరిస్తుంది. అయితే విదేశీ దేశాలు పొందిన రూపాయిని తిరిగి ఎలా ఉపయోగించాలి అన్నది కీలక ప్రశ్న. భారత్ నుంచి వస్తువులు కొనుగోలు చేయడం, భారత ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడం లేదా ఇతర లావాదేవీల్లో రూపాయిని ఉపయోగించే అవకాశాలు పెరిగితేనే దానిపై డిమాండ్ స్థిరంగా పెరుగుతుంది. అందుకే రూపాయి అంతర్జాతీయకరణ కేవలం చెల్లింపు వ్యవస్థ మార్పుతో పూర్తయ్యే ప్రక్రియ కాదు. విదేశీ మారకద్రవ్య కొరతతో ఉన్న దేశాలకు స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం ఒక ఆర్థిక భద్రతా మార్గంగా మారవచ్చు. డాలర్ నిల్వలు తగ్గిపోయినా ఆహారం, మందులు, ఇంధనం, పారిశ్రామిక వస్తువులు వంటి అవసరమైన దిగుమతులు కొనసాగించే అవకాశం వారికి లభిస్తుంది. ముఖ్యంగా రుణ సంక్షోభాలు, చెల్లింపుల సమస్యలు లేదా కరెన్సీ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాన్ని అందించగలదు. ఈ పరిణామం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపవచ్చు. ద్విపాక్షిక వాణిజ్యం, అంతర్జాతీయ రుణాలు, కమోడిటీ మార్కెట్లు, విదేశీ మారక నిల్వల్లో డాలర్ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే భారత్‌తో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని పెంచుకుంటే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ క్రమంగా బహుళ కరెన్సీ వ్యవస్థ వైపు కదిలే అవకాశం ఉంది. అంటే డాలర్ స్థానాన్ని ఒక్కసారిగా మరో కరెన్సీ భర్తీ చేయడం కాదు... డాలర్‌తో పాటు యూరో, యువాన్, రూపాయి, యెన్ వంటి కరెన్సీలకు ప్రాంతీయ, ద్వైపాక్షిక వాణిజ్యంలో మరింత ప్రాధాన్యం రావచ్చు. అందుకే భారత్ విధానాన్ని పూర్తిగా 'డాలర్‌పై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించడం కంటే, కరెన్సీ ఆధారాలను విభిన్నం చేసుకునే వ్యూహంగా చూడటం సముచితం. "డాలర్‌ను వదిలేయడం భారత్ లక్ష్యం కాదు; ఒకే కరెన్సీపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పెంచుకోవడం ప్రధాన ఉద్దేశం. భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక ఆంక్షలు లేదా అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఈ ప్రత్యామ్నాయాలు భారత్‌కు కొంత ఆర్థిక రక్షణ కల్పించవచ్చు. రూపాయి వాణిజ్యం పెరగడం ఆర్థిక స్థిరత్వానికి కూడా బలం చేకూర్చవచ్చు. భారత్‌తో రూపాయిలో వాణిజ్యం చేసే దేశాలతో బ్యాంకింగ్ సంబంధాలు, చెల్లింపు వ్యవస్థలు, పెట్టుబడుల మార్కెట్ అనుసంధానమయ్యే అవకాశం ఉంది. యుపిఐ వంటి భారతీయ డిజిటల్ చెల్లింపు వ్యవస్థలను ఇతర దేశాలతో అనుసంధానించే ప్రయత్నాలు కూడా ఇదే విస్తృత వ్యూహంలో భాగంగా చూడవచ్చు. స్థానిక కరెన్సీ వాణిజ్యం, వేగవంతమైన సరిహద్దు చెల్లింపులు, డిజిటల్ చెల్లింపులు కలిసి పనిచేస్తే భారతదేశానికి ప్రాంతీయ ఆర్థిక ప్రభావం మరింత పెరగవచ్చు. అయితే ఈ మార్పుకు సవాళ్లు ఉన్నాయి. రూపాయి విలువలో అధిక తీవ్రత ఉంటే విదేశీ వ్యాపారులు దానిని స్వీకరించడానికి వెనుకాడవచ్చు. భారత ఆర్థిక మార్కెట్లు ఇంకా డాలర్ లేదా యూరో మార్కెట్ల స్థాయిలో అంతర్జాతీయ లోతును సాధించాల్సి ఉంది. అలాగే చమురు వంటి కీలక దిగుమతులకు భారత్‌కు డాలర్ అవసరం కొనసాగుతుంది. విదేశీ దేశాలు పెద్ద మొత్తంలో రూపాయిని స్వీకరించిన తర్వాత దానిని పెట్టుబడులు లేదా ఇతర వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకునే అవకాశాలు పరిమితంగా ఉంటే, రూపాయి ఆధారిత వాణిజ్యం విస్తరించడం కూడా కష్టమే. భారత్ ముందుకు తీసుకెళ్తున్న వ్యూహం దీర్ఘకాలికమైనది. ద్వైపాక్షిక వాణిజ్యంలో స్థానిక కరెన్సీల వినియోగం పెంచడం, బ్యాంకింగ్-చెల్లింపు వ్యవస్థలను అనుసంధానించడం, రూపాయిలో పెట్టుబడులు మరియు ఆర్థిక మార్కెట్ల వినియోగాన్ని పెంచడం ద్వారా దాని అంతర్జాతీయ పాత్రను బలోపేతం చేయాలన్నది దీని విస్తృత లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, బలమైన బ్యాంకింగ్ వ్యవస్థ, లోతైన మూలధన మార్కెట్లు, స్థిరమైన ద్రవ్య విధానం, పెట్టుబడిదారుల విశ్వాసం కీలకం. మొత్తంగా చూస్తే, భారత్ చేపడుతున్న రూపాయి వాణిజ్య వ్యూహం డాలర్‌ను ఓడించే తక్షణ ప్రయత్నం కాదు. విదేశీ కరెన్సీ కొరత ఉన్న దేశాలకు వాణిజ్య ప్రత్యామ్నాయం కల్పించడం, భారత ఎగుమతులకు కొత్త మార్కెట్లు తెరవడం, రూపాయి అంతర్జాతీయ వినియోగాన్ని పెంచడం, డాలర్‌పై ఆధారపడే రిస్క్‌ను తగ్గించడం దీని ప్రధాన లక్ష్యాలు.

# మోదీ మాటల తూటాలపైనే గురి!



మోదీ ప్రభుత్వం అన్యాయాలు, అక్రమాలను ప్రతిఘటిస్తూ..నాటి ఆయన సూచనలను తు.చ తప్పక పాటిస్తున్నది 'సీజేపీ'! అంటే..ఆ పేరిట ఐక్యమైన భారత యువత! నాడు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించినట్టే..నేడు ప్రజాస్వామ్యం కోసం సమైక్యంగా ఉద్యమించింది దేశ యువత! శాంతియుతంగా ఉద్యమిస్తున్న వారి అణచివేతకు మోదీ, అమిత్ షా చేపట్టిన అప్రజాస్వామిక చర్యలు..నాడు స్వాతంత్ర్య ఉద్యమకారులపై క్రూర అణచివేతకు పూనుకున్న బ్రిటిష్ పాలకులను గుర్తుచేస్తున్నాయి! పరీక్ష పేపర్ల లీకేజీకి కారకుడైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరినట్టే..13 కోట్ల మంది ఓటర్లను తొలగించిన సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను కోరుతూ శాంతియుత నిరసనకు దిగింది యువత!-'ఓటర్ల లిస్టు నుంచి ఒక ఓటరు పేరు తొలగించడమంటే ఒక వ్యక్తి దేహం నుంచి అతని ఆత్మను తొలగించడమే!-నోటీసు ఇవ్వకుండా బతికున్న ఓటరును తొలగించడం రాజ్యాంగ విరుద్ధమే'నని ఉద్ఘాటించారు జస్టిస్ ఉజ్జల్ భుయాన్.నోటీసులు ఇవ్వకపోవడమే కాకుండా, సహ ఈసీలు సుఖ్‌బీర్ సింగ్, వివేక్ జోషిల అభ్యంతరాలను కూడా లెక్కచేయక, చట్టబద్ధంగా మార్చవలసిన 'ఫారమ్ 6-7-8'లను ఏకపక్షంగా మార్చి, 14 శాతం ఓటర్లను తొలగించడం జ్ఞానేశ్ అతి పెద్ద అప్రజాస్వామిక చర్య! ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ రితికా చోప్రా ఏడాదిపాటు పరిశోధించి-'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ద్వారా జ్ఞానేశ్ గుట్టును రట్టు చేయడంతో దేశం ఉలిక్కిపడింది! ఈ కుట్ర గురించి ప్రతిపక్షాలు, సీజేపీ సంధిస్తున్న ఏ ఒక్క ప్రశ్నకూ జవాబు చెప్పలేక, మౌనం వహించడం ద్వారా జ్ఞానేశ్ తప్పులను అంగీకరించకనే అంగీకరించినట్లయ్యింది మోదీ సర్కార్. అసలీ తప్పుల్ని జ్ఞానేశ్ చేత చేయించింది మోదీ, అమిత్ షాలేనని సీజేపీ సహా బీజేపీయేతర పార్టీలన్నీ ముక్తకంఠంతో చెప్తున్నాయి! ఐనా సరే సదరు ఆరోపణలు అవాస్తవాలను సహేతుకంగా నిరూపించి, ప్రజాస్వామ్యం బతికే ఉన్నదని ప్రజలకు విశ్వాసాన్ని కలిగించాల్సిన మోదీ ప్రభుత్వం-తమను నిలదీసిన ప్రత్యర్థులను కేసులతో, తమ గుట్టును రట్టు చేస్తున్న జర్నలిస్టులను చిత్రహింసలతో, శాంతియుత నిరసనకారులను పోలీసులతోనే కాకుండా ప్రైవేట్ గూండాలతో చితగ్గొట్టిస్తూ..అధికారాన్ని నిలబెట్టుకుంటున్నారు. కార్పొరేట్ల కోసం పరిశ్రమిస్తున్న తమ పార్టీ, ప్రజాభిమానంతో గద్దెనెక్కడం అసాధ్యమన్న వాస్తవం మోదీ, అమిత్ షాకు తెలుసు! అందుకే రాజ్యాధికారం కోసం పలు మాయోపాయాలను రూపొందించుకున్నది బీజేపీ. ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని అదృశ్యం చేసే అతి పెద్ద కుట్ర ఏమంటే? తమ ఈసీ జ్ఞానేశ్ ద్వారా బీజేపీ వ్యతిరేక ఓట్లను కోట్లలో తొలగించడం-తమ ఈవీఎంల రిగ్గింగ్‌కు తోడ్పడేలా లక్షలాది దొంగఓట్లను చేర్పించడం ద్వారా ఎట్టిపరిస్థితుల్లోనూ, ఎప్పటికీ బీజేపీనే గద్దెనెక్కించే దిశగా ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేశారు మోదీ, అమిత్ షా!ఈ ప్రమాదం నుంచి భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కదనరంగంలో దూకింది సీజేపీ! నాడు మన్‌మోహన్ ప్రభుత్వాన్ని గద్దెదించేదాకా యువతను కదం తొక్కించిన నాటి మోదీ మాటల తూటాలనే నేడు ప్రభుత్వానికి గురిపెట్టింది సీజేపీ! వీరోచిత సీజేపీ వెంటే బీజేపీయేతర పార్టీలన్నీ కదం తొక్కుతున్నాయ్! విజయీభవ సీజేపీ! అభీష్ట సిద్ధిరస్తు సీజేపీ!

# ఫ్రాన్స్‌లో నిరసనల సెగ



ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలతో ఫ్రాన్స్ అట్టుడుకుతున్నది. రాజధాని ప్యారిస్ సహా పలు నగరాల్లో ఆందోళనకారులు విధ్వంసకాండ, లూటీలకు దిగడంతో పరిస్థితి చేయిదాటిపోతున్నది. ప్రభుత్వ సంపద, వాణిజ్య సముదాయాలు లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయి. అమూల్యమైన వారసత్వ సంపదగా భావించే పలు అద్భుతమైన భవనాలకు నిరసనకారులు నిప్పు పెట్టడంతో వాటిల్లోంచి మంటలు ఎగుసిపడుతున్న దృశ్యాలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. విద్యావ్యవస్థలో పరిస్థితులు మెరుగుర్చాలంటూ ఉన్నత పాఠశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు వీధుల్లోకి రావడంతో ఈ ఆందోళనలు మొదలైన సంగతి తెలిసిందే. బోధనా సిబ్బంది కొరత, సౌకర్యాల లేమికి నిరసనగా ఇది తలెత్తింది.తదనంతరం దిగజారిన జీవనప్రమాణాలు, పెరుగుతున్న ఇంధన ధరల పెరుగుదల, సామాన్యులకు అందుబాటులో లేకుండాపోయిన గృహవసతి వంటి సమస్యలపై నిరసన తెలియజేస్తూ కార్మిక సంఘాలు, రైతులు, సామాన్య ప్రజలు వచ్చి చేరడంతో ఆందోళన స్వరూపం పూర్తిగా మారిపోయింది. స్థూలంగా చెప్పాలంటే ఆదాయాలు పడిపోవడం, జీవనవ్యయం పెరగడం ఫ్రెంచ్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నది. ప్రజలకు, వాణిజ్య రంగానికి తక్షణ ఆర్థిక ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినప్పటికీ ఆందోళనకారులు పట్టు వీడేందుకు ససేమిరా అంటున్నారు. ఒక అంచనా ప్రకారం గత వారాంతంలో ఐదున్నర లక్షల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. పోలీసులు, ఆందోళనకారుల మధ్య జరుగుతున్న తీవ్ర ఘర్షణలతో అంతర్యుద్ధం లాంటి పరిస్థితి నెలకొన్నది. పెద్దసంఖ్యలో పోలీసులు అల్లర్లలో గాయపడ్డారు. అనేక నగరాల్లో కర్ఫ్యూ అమలవుతున్నది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2,500 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. ఆందోళనల నెపమంతా వలసదారులపైకి నెట్టే ప్రయత్నాలు సామాజిక మాధ్యమాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. పైగా బూటకపు వీడియోలతో రకరకాల కథనాలు జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్‌లో జరుగుతున్న విధ్వంసానికి వలసదారులే కారణమని, వారి రాకకు అడ్డుకట్ట వేయాలని తనదైన ధోరణిలో పోస్ట్ పెట్టారు. కొందరు యూరప్ రాజకీయ నాయకులు సైతం ఇదే తరహాలో వలసదారులపై విమర్శలు ఎక్కుపెడుతూ ఈ చర్చకు ఆజ్యం పోస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్టు మతపరమైన కోణంలోనూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఫ్రాన్స్ నాయకత్వం వామపక్షాలపై దాడి చేస్తున్నది. ఈ తరహా ప్రచారం అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే అవుతుంది. ఈ విమర్శల్లో ఎక్కడా కూడా సామాన్యుల సమస్యలు ప్రస్తావనకు రాకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ప్రస్తుత అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ పదవీకాలం ముగిసిపోనున్న తరుణంలో, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హింసాత్మక నిరసనలు పెల్లుబుకడం గమనార్హం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి నినాదాన్ని ప్రపంచానికి అందించిన ఫ్రాన్స్‌కు నిరసన హక్కు గురించి తెలియజెప్పాల్సిన అవసరం లేదు. నిజానికి ఫ్రాన్స్‌లో భారీస్థాయిలో ప్రజాందోళనలు జరగడం కొత్తేమీ కాదు. 19వ శతాబ్దిలో జరిగిన రైతుల తిరుగుబాట్లు, ప్యారిస్ విప్లవం వంటివి ప్రపంచ చరిత్రలో కీలక ఘటనలుగా నిలిచాయి. 20వ శతాబ్దిలో కార్మిక సంఘాల ఆందోళనలు, అవి సాధించిన విజయాలు హక్కులకు బలమైన పునాదులు వేశాయి. వాటన్నిటి గురించి ఇప్పటికీ గొప్పగా చెప్పుకోవడం ఆనవాయితీ. విద్యార్థులు, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వేరే దారిలేక వీధుల్లోకి వచ్చారు. నెల రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నా తగిన విధంగా స్పందించని దేశ నాయకత్వమే ప్రస్తుత పరిస్థితికి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.. హింసాకాండ, లూటీలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందే. దాంతోపాటే ప్రజల స్థితిగతులు మెరుగుపర్చడం మీద దృష్టి నిలపాల్సిన అవసరం ఉన్నదని ఫ్రాన్స్ పాలకులు గుర్తిస్తే మంచిది.

# అమెరికాలోనూ నిత్యం నిరసనలు జరుగుతాయ్..

**భారత్‌లో నిరసనలపై మార్కో రూబియో**

న్యూఢిల్లీ

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీ లో గత కొన్ని రోజులుగా నిరసనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసనల కట్టడికి భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఐక్యరాజ్యసమితి కి చెందిన నిపుణుల బృందం ఇటీవల విమర్శించింది. దీనిపై రూబియో తాజాగా స్పందించారు.ఒక దేశ అంతర్గత అంశాలపై తాను జోక్యం చేసుకోనని రూబియో చెప్పారు. అదే సమయంలో ప్రజాస్వామ్య దేశాల్లోని పరిస్థితుల గురించీ మాట్లాడారు. 'ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ. ఇక్కడ ఎన్నికలు జరుగుతాయి. రాజకీయ విభేదాలు, ప్రజల అభిప్రాయాల వెల్లడి ఈ వ్యవస్థలో సర్వసాధారణం. అమెరికాలోనూ రోజూ నిరసనలు జరుగుతాయి. ఒక దేశంలో ప్రజలు బయటకు వచ్చి నిరసనలు చేస్తున్నారనేది రాజకీయ చర్చలు,



అభిప్రాయ భేదాలు ఉన్నాయనడానికి సంకేతం' అని పేర్కొన్నారు. ఢిల్లీలో యువత నిరసనలను కట్టడి చేసేందుకు భారత ప్రభుత్వం మితిమీరిన బలప్రయోగం చేస్తోందని, ఏకపక్షంగా నిర్బంధాలు చేస్తోందని ఐరాసకు చెందిన 20 మంది మానవహక్కుల నిపుణులు ఇటీవల వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వ చర్యలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని ఈ సందర్భంగా ఆ నిపుణులు కోరారు. ఆ బృందం ఖండనపైనే రూబియో మాట్లాడారు. భారత్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా మార్కో రూబియో గుజరాత్‌లోని జామ్ నగర్ వెళ్లారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహిస్తోన్న చమురుశుద్ధి కర్మాగారాన్ని సందర్శించారు. భారత్ ఓ రిఫైనింగ్ సూపర్ పవర్ అని, భారీగా ముడి చమురును శుద్ధిచేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని ఆయన కొనియాడిన నేపథ్యంలో ఈ పర్యటన జరుగుతుండటం గమనార్హం. వెనెజువెలా చమురును విక్రయించేందుకు అమెరికా కొత్త మార్కెట్లను వెతుకుతోంది. ఇలాంటి సమయంలో చమురును శుద్ధిచేసే సామర్థ్యం భారీగా ఉన్న భారత్ వైపు అగ్రరాజ్యం చూపు పడింది. పశ్చిమాసియా ఘర్షణతో హర్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రం మీదుగా నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దాంతో ఇంధన సరఫరాకు అంతరాయాలు కలుగుతున్నాయి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ఈ రిఫైనరీ ఉపయోగపడుతుందనే అంచనాలు ఉన్నాయి.

# విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం!





**-ప్రజల రక్షణే లక్ష్యంగా పోలీసుల నిరంతర సేవలు: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**-అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం.. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సంస్మరణ కార్యక్రమం**

**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21, 2026.**
నంద్యాల :విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోరాడి అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఐఏఎస్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్మృతి పరేడ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరులకు ఘనంగా నివాళు లర్పించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ భాషా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల వివరాలను చదివి వినిపించారు.

**పోలీస్ యూనిఫాం బాధ్యతకు ప్రతీక**
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ పోలీసు యూనిఫాం కేవలం అధికారానికి గుర్తు మాత్రమే కాదని, బాధ్యత, ధైర్యం, అంకితభావం, త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకునేందుకు



పోలీసులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, బలహీన వర్గాల రక్షణలో పోలీసుల పాత్ర కీలకమని తెలిపారు. ప్రజల సమస్యలను గౌరవంగా ఆలకించి పరిష్కరించే స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ మధ్య సమన్వయం అవసరమని పేర్కొంటూ పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రజాసేవలో పోలీసుల త్యాగం వెలకట్టలేనిది**
అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ భాషా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించడం వెనుక గొప్ప చరిత్ర ఉందన్నారు. 1959 అక్టోబర్‌లో లడఖ్ ప్రాంతంలో చైనా బలగాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ఈ రోజును పాటిస్తున్నట్లు వివరించారు. పోలీసు ఉద్యోగం కేవలం జీవనోపాధి కాదని, అది బాధ్యతతో కూడిన ప్రజాసేవ అని పేర్కొన్నారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు పండుగలు, అత్యవసర పరిస్థితుల్లోనూ నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. నేరాల నియంత్రణలో కఠినంగా వ్యవహరిస్తూనే, చట్టాల అమలులో నిష్పక్షపాతంగా, ప్రజల పట్ల మానవీయ దృక్పథంతో పనిచేయడం పోలీసుల బాధ్యతని అన్నారు. అమరవీరుల త్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

**అమరవీరుల కుటుంబాలకు సన్మానం**
కార్యక్రమంలో భాగంగా పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. అమరుల కుటుంబాల పట్ల పోలీసు శాఖకు ఉన్న గౌరవం, బాధ్యతను ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ సుస్మిత, ఐపీఎస్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారులు, రిజర్వు పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## కొత్తపల్లె ఎంపీటీసీ బరిలో తాతిరెడ్డి రాధా..

**-మంత్రి ఫరూక్‌ను కలసి ఆశీస్సులు**

**-కూటమి బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ దాఖలు**





**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21, 2026.**
నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామ ఎంపీటీసీ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం బలపరిచిన తాతిరెడ్డి రాధా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం నంద్యాల పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్‌కు పుష్పగుచ్ఛం అందించి ఆశీస్సులు తీసుకున్నారు. ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తాతిరెడ్డి రాధాకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అలాగే గ్రామంలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి, మనీష్ రెడ్డి, కూటమి నాయకులు, స్థానిక కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో అన్నప్రసాద వితరణకు రూ.1,00,116 విరాళం



**శ్రీశైలం డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,**
శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ప్రవాస భారతీయులు, కెనడాకు చెందిన శ్రీ వరికూటి దార్విక రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం (21.10.2026) దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి బి. మల్లికార్జునరెడ్డికి విరాళ మొత్తాన్ని అందించారు. విరాళం స్వీకరించిన అధికారులు దాతకు దేవస్థానం తరఫున రశీదుతో పాటు ప్రసాదాలను అందజేశారు. అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం అందించి తమ వంతు సహకారం అందించిన దాతను దేవస్థానం అధికారులు అభినందించారు.

## శ్రీశైలంలో వీరభద్రస్వామికి విశేష పూజలు



**శ్రీశైలం: డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,**
లోకకల్యాణం, లోకశాంతి కోసం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం (21.10.2026) సాయంకాలం ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీశైల మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తర భాగంలో మల్లికాగుండం పక్కన వీరభద్రస్వామివారు జ్వాలామకుటంతో పది చేతులతో విశిష్ట రూపంలో దర్శనమిస్తున్నారు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామివారిని అఘోరవీరభద్రమూర్తిగా పిలుస్తారు. స్వామివారి పక్కన దక్షప్రజాపతి విగ్రహం కూడా దర్శనమిస్తుంది. ఈ స్వామివారిని దేవస్థానం పరివార ఆలయాలలో భాగంగా ప్రతిరోజూ పూజిస్తోంది. ప్రతి బుధవారం ప్రదోషకాలంలో దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పూజల వల్ల లోకశాంతి, దుర్భిక్ష నివారణ కలగడంతో పాటు భక్తుల కోరికలు నెరవేరుతాయని, క్షేత్ర అభివృద్ధి జరుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. పూజా కార్యక్రమంలో భాగంగా ముందుగా విఘ్నాలు తొలగేందుకు మహాగణపతి పూజ నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామివారికి పంచామృతాలతో పాటు వివిధ రకాల ఫలోదకాలు, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకం, మల్లికాగుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామివారికి విశేష పుష్పార్చన జరిపించారు.

## ఎగువ తొట్లి పల్లిని దిగువతొట్లి పల్లి పంచాయతీలో విలీనం చేయాలని గ్రామస్తుల డిమాండ్

**స్పందించకపోతే ఎన్నికల బహిష్కరణ!"**



**తనకల్లు అక్టోబర్ 21 డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తనకల్లు మండలానికి చెందిన ఎగువ తొట్లి పల్లి గ్రామస్తులు తమ గ్రామాన్ని ప్రస్తుతం ఉన్న గేమేనాయక్ పల్లె పంచాయతీ నుండి దిగువతొట్లి పల్లి గ్రామ పంచాయతీలోకి మార్చాలని కోరుతూ కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం, ప్రభుత్వ సేవల అందజేత, అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం మా గ్రామాన్ని దిగువతొట్లి పల్లి పంచాయతీ పరిధిలోకి మార్చడం ఎంతో అనుకూలంగా ఉంటుందని, గతంలో ఎన్నోసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ తగిన స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడం, రేషన్ తీసుకోవడానికి, సచివాలయానికి బస్సు సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నామని, మధ్యలో పాపాగ్ని నది వెళ్తున్నందున, నడుచుకుంటూ వెళ్లడానికి ఇబ్బందులు పడుతూ, తద్వారా వచ్చే సమస్యలతో పాటు పలు ఇబ్బందుల కారణంగా ఈసారి జరిగే ఎన్నికలను మా గ్రామం నుండి పూర్తిగా బహిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. కావున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, గ్రామ ప్రజల పరిస్థితులు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నిబంధనల ప్రకారం ఎగువ తొట్లి పల్లి గ్రామాన్ని దిగువతొట్లి పల్లి గ్రామ పంచాయతీలోకి మార్చేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలు, పెద్దలు వినయపూర్వకంగా కోరుతున్నారు.

## నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్న ఎమ్మెల్యే సోదరుడు

**-గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల్లో అనూహ్య పరిణామం...**



**గిద్దలూరు,మార్కాపురం, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,**
ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నామినేషన్ ప్రక్రియలో కూటమి తరుపున అభ్యర్థిగా ఉన్న బిజెపి నేతకు పోటీగా, రెబెల్ అభ్యర్థిగా ఇండిపెండెంట్ గా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు కృష్ణకిషోర్ రెడ్డి మూడు నామినేషన్ పత్రాలను వేసిన విషయం తెల్సిందే.. అయితే బుధవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు కృష్ణకిషోర్ రెడ్డి ఎన్నికల అధికారి వద్దకు వెళ్లి తాను వేసిన మూడు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో సర్వత్రా ఈ విషయం తీవ్ర చర్చాంశనీయంగా మారింది.. దీంతో పోటీలో బిజెపి అభ్యర్థికి మార్గం సుగమం అయినట్లుగా తెలుస్తుంది

## పోలింగ్ కేంద్రాల వారీగా రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ



**ఒంగోలు,ప్రకాశం బ్యూరో, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,**
ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి పోలింగ్ కేంద్రాల వారీగా రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను అధికారులు బుధవారం నిర్వహించారు. జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కె.హెప్సిబారాణి, వ్యయ పరిశీలకులు వివేక్, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి సమక్షంలో ప్రకాశం భవనంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఆన్ లైన్ లో చేపట్టి సిబ్బందికి కోడ్ కేటాయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి.వి. రమణ, అర్బన్ ఎలక్షన్స్ నోడల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, సిపిఓ సుధాకర్ రెడ్డి, ఎన్ఐసి ఆఫీసర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం





**శ్రీశైలం డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,**
లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం శ్రీ సాక్షిగణపతిస్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. ప్రతి బుధవారం, సంకటహర చవితి, పౌర్ణమి రోజుల్లో దేవస్థానం తరఫున స్వామివారికి ఈ విశేష అభిషేకం, పూజాదికాలను సేవగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలు, వివిధ ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. గణపతి అభిషేకానికి విశేష ప్రాధాన్యం వైదిక సంప్రదాయాల్లో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. స్వామివారి అభిషేకం వల్ల కార్యసిద్ధి కలిగి, ఆటంకాలు తొలగి విజయాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసం. అలాగే కోరిన కోరికలు నెరవేరడంతో పాటు ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరిగి విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని భక్తులు నమ్ముతారు.

**సాక్షిగణపతి ఆలయానికి ప్రత్యేక విశిష్టత**
శ్రీశైల క్షేత్ర పరివార ఆలయాల్లో సాక్షిగణపతి ఆలయానికి ప్రత్యేక స్థానం ఉంది. శ్రీశైల మహాక్షేత్రాన్ని దర్శించిన భక్తుల వివరాలను కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామివారు సాక్ష్యంగా తెలియజేస్తారని ప్రసిద్ధి. అందువల్లే స్వామివారు సాక్షిగణపతిగా పేరొందారు. చక్కని నల్లరాతితో మలచబడిన స్వామివారు ఒక చేతిలో కలం, మరో చేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తారు.

# సంప్రదాయబద్ధంగా దసరా సంబరాలు





**హైదరాబాద్, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,** జియాగూడ, పురానాపూల్, కార్వాన్, రహీంపురా, కుల్సుంపురా ప్రాంతాల్లో దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. జియాగూడ డోర్ బస్తీలో వీరైవ్ కక్కయ సమాజ్ ఆధ్వర్యంలో భారతమాత, ఛత్రపతి శివాజీ, మహారాణా ప్రతాప్, భగత్‌సింగ్, హనుమంతుడు, బసవేశ్వర మహారాజ్ వేషధారణలతో గుర్రాలు, భగ్గీలపై మహాశోభాయాత్ర నిర్వహించారు. పురానాపూల్ మూసీనది ఒడ్డున సీమోల్లంఘన్ దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా మిలాప్ వేడుకలు, రావణ దహనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బోహిని దర్శన్, ముఖేష్‌సింగ్, మిత్రకృష్ణ, పరమేశ్వరీ సింగ్, రాజేందర్ ప్రసాద్ జైస్వాల్, సదానందం గుప్తా, కాలియా పహిల్వాన్, ఏసీపీ వి. తిరుపతి, ఇన్‌స్పెక్టర్ ఎ. రాములు, సమితి ప్రతినిధి జితేందర్ సింగ్ తదితరులు పాల్గొని కళాకారులను సన్మానించారు. వేలాది మంది సందర్శకుల సమక్షంలో రావణ దహనం కన్నుల పండువగా జరిగింది.

## కత్తితో హత్యాయత్నం చేసిన ముగ్గురు నిందితులు అరెస్ట్

**-రిమాండ్‌కు తరలింపు**




**కోరుట్ల డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,** దసరా పండుగ సందర్భంగా జరిగిన గొడవ నేపథ్యంలో ఒక వ్యక్తిపై కత్తితో దాడి చే సి గాయపరిచిన ముగ్గురు నిందితులను కోరుట్ల పోలీ సులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.వివరాల్లోకి వెళితే, కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గు ద్దేటి రాజేందర్ (43) తన కా లనీలో దుర్గామాత అమ్మ వారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రామ్ నగర్ కా లనీకి చెందిన కిరణ్(19), అ జయ్(19)లతో గొడవ జరి గింది. బుధవారం తెల్లవా రుజామున సుమారు 03: 00 గంటలకు కిరణ్, అజ య్‌లు జ్ఞానదీప్(20)తో కలి సి అర్బన్ కాలనీలోని దుర్గా మాత ఆలయం వద్దకు వ చ్చి రాజేందర్‌తో గొడవకు ది గారు.ఈ క్రమంలో కిరణ్, అ జయ్‌లు రాజేందర్‌ను పట్టు కోగా, జ్ఞానదీప్ తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చే యడంతో రాజేందర్ ఎడమ భుజం, మెడ ఎడమ వైపు గాయాలయ్యాయి. స్థానికు లు నిందితులను పట్టుకోవ డానికి ప్రయత్నించగా, వా రు కత్తితో బెదిరించి అక్కడి నుంచి పారిపోయారు. బా ధితుడి ఫిర్యాదు మేరకు కే సు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కోరుట్ల పోలీసులు నిందితులైన కిరణ్, అజ య్, జ్ఞానదీప్‌లను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హా జరుపరిచి రిమాండ్‌కు తర లించారు.పండుగల సమ యంలో ప్రజలు సంయమ నం పాటించాలని, గొడవ లకు పాల్పడుతూ శాంతిభ ద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కోరుట్ల పోలీసులు తెలిపారు.

## మంథని పోలీస్ స్టేషన్ లో ఘనంగా పోలీస్ అమర వీరుల దినోత్సవం



**మంథని, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,** మంథని పోలీస్ స్టేషన్ లో అధికారులు, సిబ్బంది తమ విధుల నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. బుధవారం మంథని పట్టణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద పూలతో నివాళులు అర్పించారు. అధికారులు అమరవీరులకు సెల్యూట్ చేసి, వారి త్యాగాన్ని స్మరించుకున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో, శాంతి, భద్రతల నిర్వహణలో పోలీస్ అమరవీరులు చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం మంథని పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. పోలీస్ స్మారక దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేసే బ్యానర్‌ను ప్రదర్శించారు. అమరవీరుల ఆదర్శాలను పాటిస్తూ, ధైర్యంతో, నిజాయితీతో ప్రజా సేవలో విధులు నిర్వర్తిస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు..

## దుర్గామాతకు వెండికిరీటం బహుకరణ



**బచ్చన్నపేట, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,** మండలంలోని ఆలీంపూర్ గ్రామ దుర్గామాతకు గ్రామానికి చెందిన చెన్నూరి బాలమణిఉప్పలయ్య దంపతులు అరకిలో వెండి కిరీటాన్ని బహుకరించారు. దసరా పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి కిరీటం బహుకరించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి తన మొక్కు చెల్లించుకున్నామని. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాకాల నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ నరెడ్ల బాలరెడ్డి, గూడ రవీందర్‌రెడ్డి, ఉప్పలయ్య, జనార్దన్‌రెడ్డి, గ్రామస్తులు దండ్యాల కరుణాకరరెడ్డి, ఆలయ పూజారి బంటు గోవర్ధన్, బాలమణిఉప్పలయ్య కుటుంబ సభ్యులు ఉన్నారు.

# పండుగ వేళ మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న రైతులు!

**-సాగునీరు, విద్యుత్ కోసం మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న కుందారం గ్రామ రైతులు!**



**జైపూర్, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,** చెన్నూరు నియోజకవర్గం జైపూర్ మండలం కుందారం గ్రామంలో సాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు.. తమ సమస్యలను మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు.

**రైతుల ఆందోళనతో ఉద్రిక్తత..**

రైతులపై మంత్రి అనుచరులు ఎదురుదాడికి దిగారనే ఆరోపణలు!

కనీసం కారు దిగి రైతులతో మాట్లాడకుండా, సమస్యల పరిష్కారంపై ఎలాంటి హామీ ఇవ్వకుండానే మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారనే విమర్శలు!

కాన్వాయ్‌ను అడ్డుకున్న రైతులను పోలీసులు బెదిరించారనే ఆరోపణలు!

అన్నదాతల సమస్యలు వినడానికి కూడా సమయం లేదా?

పంటలకు సాగునీరు కావాలి.. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ కావాలి.. ఇవి రైతులు అడుగుతున్న కనీస అవసరాలు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరిన రైతులకు భరోసా ఇవ్వాల్సింది పోయి, వారిని పట్టించుకోకుండా వెళ్లిపోవడం ఎంతవరకు సమంజసం?

ప్రజా ప్రతినిధులు రైతుల సమస్యలను వినాలి.. పరిష్కార మార్గాలు చూపాలి.. అంతేకానీ, తమ హక్కుల కోసం నిలదీసిన రైతుల గొంతును అణచివేయకూడదు.

రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలి.. కుందారం రైతులకు న్యాయం చేయాలి

# దళిత యువకునిపై అగ్రకులాల దాడి అమానుషం




**మంథని, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,** కమాన్‌పూర్ మండలం నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన దళిత యువకుడు అగ్గిమల్ల అనిల్‌పై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఎంసీ సభ్యురాలు, ఉమెన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ ఇరుగురాళ్ల భాగ్యలక్ష్మి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై బుధవారం మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పని నిమిత్తం రొంపికుంటకు వెళ్లిన అగ్గిమల్ల అనిల్‌పై, మాడిశెట్టి ఆదిత్య పటేల్, సింధం సాయి ప్రణీత్, మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు వారు ఆరోపించారు. దళితులపై వివక్ష చూపడం సరికాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. దళితుల హక్కుల కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దళిత సంఘాలను ఏకతాటి పైకి తీసుకువస్తుంటే, మరోవైపు కుల వివక్షతో దళితులను చిన్నచూపు చూడడం బాధాకరమని వారు పేర్కొన్నారు. దళితులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని వారు పిలుపు ఇచ్చారు. అనిల్ పై దాడి ఘటనకు సంబంధించి దళిత గ్రామస్తులు కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని, హత్యాయత్నం కేసు నమోదు చేసే అధికారం తమకు లేదని ఎస్ఐ చెప్పినట్లు బాధితుల తరపున వారు పేర్కొన్నారు. అయితే ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సమగ్ర విచారణ జరిపి, వర్తించే చట్టాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. బాధితుడికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చిప్పకుర్తి ఓదెలు, అగ్గిమల్ల నరసయ్య, నల్లాల మల్లేష్, నల్లాల లక్ష్మి, అగ్గిమల్ల సరోజన, చట్ల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు..

# నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలి

**-డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)**



**రామగిరి, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,** నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సింగరేణి అడ్రియాల లాంగ్ వాల్, ఓసిపి-2 ఉపరితల గనులను సందర్శించి, నడుస్తున్న పనులను పరిశీలించారు.వారికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావులు స్వాగతం పలికారు. అనంతరం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి తీసుకుంటున్న చర్యల గురించి వారికి వివరించారు. ముందుగా అడ్రియాల లాంగ్ వాల్ గని లోపలికి వెళ్లి నడుస్తున్న పనులను పరిశీలించారు. తదుపరి ఓసిపి -2 ఉపరితల గని లోకి వెళ్లి యంత్రాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జి. యం కార్యాలయంలో రామగుండం -3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి భద్రత, ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా మొదలగు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన ఓ.బి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను, ప్రణాళికను రూపొందించుకోవాలని, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, కె.జనార్ధన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి.లక్ష్మీనారాయణ, విభాగాదిపతులు బి.టి.మురళీ కృష్ణ, అఫ్సర్ పాషా, కె.ఐలయ్య, ఆసిఫ్ యాసిన్, మనోజ్ కుమార్, మేనేజర్ భరత్ కుమార్, లతో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాశమైలారంలో ఘనంగా విజయదశమి వేడుకలు

**-వైభవంగా రావణ దహనం.. ముఖ్య అతిథిగా కాటా శ్రీనివాస్ గౌడ్**

**-భారీగా తరలివచ్చిన ప్రజలు.. పాశమైలారంలో పండుగ సందడి**





**పటాన్‌చెరు డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 21,** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం వార్డులో విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో సంప్రదాయబద్ధంగా జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రావణ దహన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పాశమైలారంలో పండుగ సందడి నెలకొంది.ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్, కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దుర్గాభవాని మాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సంతోషాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సంప్రదాయాలను కాపాడుతూ ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిత సుధాకర్ గౌడ్, సాయి గౌడ్, మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయదశమి వేడుకలను విజయవంతం చేశారు.

# బిజినెస్

# రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 650లో ప్రత్యేక ఎడిషన్

-125వ వార్షికోత్సవం సందర్భంగా హైపర్ షిఫ్ట్ విడుదల
-కేవలం 125 బైక్‌లే అందుబాటులోకి
-ధర రూ.4.26 లక్షలుగా నిర్ణయం
-648 సీసీ ఇంజిన్‌తో ప్రత్యేక మోడల్
-కాంతిని బట్టి రంగు మారే పెయింట్ ఫినిష్
-అక్టోబర్ 28లోపు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం
-అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు ప్రక్రియ
-నవంబర్ 2026 నుంచి డెలివరీలు ప్రారంభం



న్యూఢిల్లీ
ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన 125వ వార్షికోత్సవం సందర్భంగా క్లాసిక్ 650 హైపర్ షిఫ్ట్ ఎడిషన్‌ను విడుదల చేసింది. పరిమిత సంఖ్యలో మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ప్రత్యేక మోడల్ బైక్ ప్రియులను ఆకట్టుకునేలా రూపొందించినట్లు సమాచారం. దీని ధరను రూ.4.26 లక్షలుగా నిర్ణయించారు. ఈ బైక్‌లో 648 సీసీ ఇంజిన్‌ను అమర్చారు. దీని ప్రత్యేక ఆకర్షణ కాంతిని బట్టి రంగు మారుతున్నట్లు కనిపించే వినూత్న పెయింట్ ఫినిష్. సాధారణ మోడళ్లకు భిన్నంగా ప్రత్యేక రూపకల్పనతో రూపొందించిన ఈ ఎడిషన్‌ను సంస్థ వార్షికోత్సవ ప్రత్యేక మోడల్‌గా తీసుకొచ్చింది. ఈ బైక్‌ను కేవలం 125 యూనిట్లకే పరిమితం చేశారు. కొనుగోలు చేయాలనుకునే ఆసక్తిగలవారు అక్టోబర్ 28లోపు సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. పరిమిత సంఖ్యలోనే బైక్‌లు అందుబాటులో ఉండటంతో రిజిస్ట్రేషన్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ ప్రత్యేక ఎడిషన్ డెలివరీలు 2026 నవంబర్ నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం. ధర, పరిమిత ఉత్పత్తి, రంగు మారే పెయింట్ ఫినిష్ వంటి ప్రత్యేకతలతో క్లాసిక్ 650 హైపర్ షిఫ్ట్ ఎడిషన్ మార్కెట్లోకి వచ్చింది.

# భారీ లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

-665 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
-188.40 పాయింట్లు ఎగసిన నిఫ్టీ
-74,518 స్థాయికి చేరిన సెన్సెక్స్
-23,077.35 వద్ద నిఫ్టీ ముగింపు
-అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో కొనుగోళ్లు
-విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల మద్దతు
-బ్యాంకింగ్, ఐటీ, ఆటో షేర్లకు డిమాండ్
-భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆశలు




ముంబై
దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల మద్దతుతో సూచీలు పుంజుకున్నాయి. కొనుగోళ్ల జోరుతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 665.10 పాయింట్లు పెరిగి 74,518 స్థాయికి చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 188.40 పాయింట్లు ఎగసి 23,077.35 వద్ద ముగిసింది. ప్రధాన సూచీల్లో నమోదైన ఈ పెరుగుదలతో మార్కెట్‌లో సానుకూల వాతావరణం నెలకొంది. బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్ రంగాలకు చెందిన షేర్లలో కొనుగోళ్లు పెరగడం మార్కెట్ ర్యాలీకి తోడ్పడింది. భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన వార్తలు, దేశ ఆర్థిక వ్యవస్థపై వెలువడిన సానుకూల సంకేతాలు మదుపర్లలో ఉత్సాహాన్ని పెంచాయి. దీంతో పలు రంగాల షేర్లలో కొనుగోళ్లకు ఆసక్తి చూపిన మదుపర్లు మార్కెట్ల లాభాలకు దోహదపడ్డారు.

# రూ.10 వేలు తగ్గిన వెండి ధర

-కిలో వెండిపై ఒక్కరోజే భారీ పతనం
-హైదరాబాద్ బులియన్ మార్కెట్లో రూ.2.30 లక్షలకు చేరిన వెండి
-వారం రోజుల్లో రూ.15 వేల వరకు తగ్గుదల
-స్థిరంగా కొనసాగుతున్న బంగారం ధరలు
-24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,46,080
-22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రూ.1,33,900
-బంగారం, వెండి ధరలపై అదనంగా 3 శాతం జీఎస్టీ
-ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు




హైదరాబాద్
హైదరాబాద్ బులియన్ మార్కెట్లో వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి ధర ఒక్కరోజే రూ.10,000 క్షీణించి రూ.2,30,000కు చేరుకుంది. వారం రోజుల వ్యవధిలోనే వెండి ధర మొత్తం రూ.15,000 వరకు తగ్గడం గమనార్హం. వరుస తగ్గుదలతో వెండి కొనుగోలు చేయాలనుకునేవారు తాజా ధరలపై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు బంగారం ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,080గా నమోదైంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,900 వద్ద కొనసాగుతోంది. బంగారం, వెండి కొనుగోళ్లపై పేర్కొన్న ధరలకు అదనంగా 3 శాతం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాల్సి ఉంటుందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఆభరణాల కొనుగోలు సమయంలో తయారీ ఛార్జీలు కూడా వర్తించవచ్చు. ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది. కొనుగోలు చేసే ముందు స్థానిక వ్యాపారుల వద్ద తాజా ధరలను నిర్ధారించుకోవడం మంచిది.

# స్పోర్ట్స్

## తుది జట్టులో వైభవ్ సూర్యవంశీకి
# చోటు దక్కడం కష్టమే: శ్రేయాస్ అయ్యర్




క్రైస్ట్‌చర్చ్
న్యూజిలాండ్‌తో గురువారం నుంచి అయిదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానున్నది. దీని కోసం భారత బృందం క్రైస్ట్‌చర్చ్ చేరుకున్నది. అయితే ఈ సిరీస్‌లో యువ డాషింగ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తుది జట్టులో స్థానం సంపాదించే అవకాశాలు అనుమానంగా ఉన్నాయి. దీనిపై టీ20 కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ క్లారిటీ ఇచ్చాడు. ప్రస్తుతం భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారని, ఆ ఇద్దరి జోడీ చెలరేగి ఆడుతోందని, ఇలాంటి సమయంలో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కడం కష్టమే అవుతుందని కెప్టెన్ శ్రేయాస్ తెలిపారు. ఇటీవల ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌కు కూడా సూర్యవంశీని ఎంపిక చేశారు. కానీ గత 21 మ్యాచుల్లో అతను కేవలం 8 మ్యాచుల్లో మాత్రమే ఆడాడు.గత 21 మ్యాచుల్లో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఇద్దరూ రెగ్యులర్ ఓపెనర్లుగా రాణిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఇండియా వరల్డ్‌కప్ గెలవడంలో ఈ టీ20 బ్యాటర్లు కీలక పాత్ర పోషించారు. సూర్యవంశీ లాంటి ట్యాలెంట్ ప్లేయర్లు డ్రెస్సింగ్ రూమ్ వద్ద గడపడం చాలా ముఖ్యమైన అంశం అవుతుందని, అతనికి అది సంతోషాన్ని ఇస్తుందని అయ్యర్ అన్నారు. అతను చాలా చిన్న వయస్కుడు అని, అవకాశాలు రావడానికి అతనికి ఇంకా చాల సమయం ఉందని, ప్రస్తుతం అతను నేరుగా జట్టులోకి రాలేదని, ఎందుకంటే మన ఓపెనర్లు నిలకడగా రాణిస్తున్నారని, వాళ్లు వరల్డ్‌కప్ గెలిచి పెట్టారని కూడా శ్రేయాస్ తెలిపారు. ఏషియన్ గేమ్స్‌లో మాత్రం సూర్యవంశీ బ్యాటింగ్ చేశాడు. దీని వల్ల ఆ టోర్నీలో శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. విదేశీ పిచ్‌లు, పరిస్థితులకు అలవాటుపడేందుకు ఇలాంటి టూర్లు సూర్యవంశీకి ఉపయోగపడుతాయని అయ్యర్ అన్నారు. అతను మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు, ఆ పరిస్థితుల్లో ఎలా ఇలాంటి పిచ్‌లపై ఆడాలో అతనికి అనుభవం వస్తుందన్నాడు. స్వదేశంలో ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన తాము.. ఇక పేస్ ఫ్రెండ్లీ పిచ్‌లపై ఆడేందుకు సిద్ధం కావాలన్నారు. కివీస్‌లో ఉన్న కోల్డ్ వెదర్ కూడా తట్టుకోవాలన్నారు. ఇక్కడ పరిస్థితులను గమనిస్తే, వెదర్ ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలిస్తుందన్నాడు. న్యూజిలాండ్‌కు హోం అడ్వాంటేజ్ ఉంటుందన్నాడు. ఇషాన్ కిషన్ మూడవ నెంబర్‌లో బ్యాటింగ్ చేస్తున్నాడని, తానేమీ ఆర్డర్‌లో ముందు వెళ్లాలనుకోవడం లేదన్నాడు.

# ఇండియాలో వరల్డ్ కప్ టోర్నీకి పాకిస్తాన్ దూరం..

## జట్టు పర్యటనకు అనుతివ్వని పీసీబీ





ఇండియాలో జరగబోయే క్రికెట్ వరల్డ్ కప్ టోర్నీకి పాకిస్తాన్ జట్టు దూరంగా ఉండనుంది. ఈ టోర్నీలో పాకిస్తాన్ పాల్గొనడం లేదని ఆ దేశానికి చెందిన పీవీసీఏ (పాకిస్తాన్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్) వెల్లడించింది. ఈ మేరకు టోర్నీ నిర్వాహకులకు సమాచారం అందించింది. పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఇండియాలో పాల్గొనేందుకు అనుమతి కోరుతూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ).. ఆ దేశ విదేశాంగ శాఖకు విజ్ఞప్తి చేసింది.అయితే, ఇండియాలో జరిగే టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి అనుమతివ్వడం లేదని పాక్ విదేశాంగ శాఖ మంత్రి, పీసీబీ చైర్మన్ మోసిన్ నఖ్వీ తెలిపారు. దీంతో పాక్ జట్టు ఈ పర్యటనకు రావడం లేదు. ఇండియాలో ఇంటర్నేషనల్ మాస్టర్స్ క్రికెట్ వరల్డ్ కప్ వచ్చే జనవరిలో జరగాల్సి ఉంది. ఇది 50 ఓవర్ల క్రికెట్. రెండేళ్లకోసారి ఈ టోర్నీ జరుగుతుంది. చివరగా గత ఏడాది శ్రీలంకలో ఈ టోర్నీ జరిగింది. ఈసారి ఇండియా ఆతిథ్యం ఇవ్వనుంది. ఇండియా-పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచుల నిర్వహణ అంశం ఇంకా సందిగ్ధంగానే ఉంది. పాకిస్తాన్‌లో పర్యటించేందుకు భారత్ ఏమాత్రం సుముఖంగా లేదు. ఇదే సమయంలో పాకిస్తాన్ కూడా ఇండియా రావడానికి సిద్ధంగా లేదు. ఇరు జట్లూ తటస్థ వేదికలపై మాత్రమే మ్యాచులు ఆడుతున్నాయి. రాబోయే టోర్నీకి సంబంధించి పాకిస్తాన్ పర్యటించడం లేదని పీవీసీఏ చీఫ్ ఫవాద్ ఇజాజ్ తెలిపారు. ఇజాజ్ మాట్లాడుతూ.. ఈ టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్తాన్ జట్టుకు వీసాలు మంజూరు చేస్తామని, ఉన్నతస్థాయి అదనపు భద్రత కల్పిస్తామని ఇండియా హామీ ఇచ్చిందని వెల్లడించారు. అయితే, తమ జట్టు ఇండియాలో పర్యటించేందుకు పాక్ ప్రభుత్వం అనుమతివ్వలేదని తెలిపారు. దీంతో తమ జట్టు స్థానంలో మరో జట్టును తీసుకోవాల్సిందిగా టోర్నీ నిర్వాహకులకు సూచించినట్లు వివరించారు. క్రికెట్ టీంతోపాటు పాక్ హాకీ టీం కూడా ఇండియాలో పర్యటించేందుకు విముఖత వ్యక్తం చేసింది. హాకీకి సంబంధించి ఆసియన్ ఛాంపియన్స్ ట్రోఫీ ఇండియాలో జరగాల్సి ఉంది. ఈ నెల 27 నుంచి టోర్నీ ప్రారంభం కావాలి. అయితే, ఈ టోర్నీలో పాల్గొనడం లేదని పాకిస్తాన్ హాకీ సమాఖ్య తెలిపింది. దీంతో పాక్ స్థానంలో బంగ్లాదేశ్ జట్టుకు స్థానం కల్పిస్తూ టోర్నీ నిర్వహించేందుకు ఇండియా సిద్ధమైంది.

## స్ప్రింటర్ సిమ్రన్ శర్మకు
# రెండో గోల్డ్ మెడల్



నగోయా
స్ప్రింటర్ సిమ్రన్ శర్మ.. ఏషియన్ పారా గేమ్స్ లో చరిత్ర సృష్టించింది. 100మీటర్ల టీ12 ఈవెంట్‌లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నది. సిమ్రన్ కేవలం 12.02 సెకన్లలో టార్గెట్‌ను ఫినిష్ చేసింది. ప్రస్తుత ఏషియన్ గేమ్స్‌లో సిమ్రన్‌కు ఇది రెండో గోల్డ్ మెడల్. మంగళవారం 200మీటర్ల టీ12 స్ప్రింట్ ఈవెంట్‌లోనూ సిమ్రన్‌కు స్వర్ణం దక్కిన విషయం తెలిసిందే. పారిస్‌లో జరిగిన పారాఒలింపిక్స్‌లో 100 మీటర్ల ఈవెంట్‌లో స్ప్రింటర్ సిమ్రన్ శర్మ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.ఇవాళ జరిగిన ఈవెంట్‌లో ఇరానీ అథ్లెట్ హాజర్ సఫర్‌జాదే కన్నా బెటర్‌గా పర్ఫార్మ్ చేసింది. ఇరానీ అథ్లెట్ 12.30 సెకన్లలో టార్గెట్ ఫినిష్ చేసింది. ఇండోనేషియాకు చెందిన నీ పుత్రి 12.51 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నది. పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన సిమ్రన్ ప్రస్తుతం కొత్త ట్రైనర్ శివం వద్ద శిక్షణ పొందుతోంది. డోపింగ్ ఉల్లంఘన కేసులో మాజీ కోచ్ ఉమర్ సైఫీని బ్యాన్ చేసిన విషయం తెలిసిందే. 2023లో హాంగ్‌జూలో జరిగిన ఏషియన్ పారా గేమ్స్‌లో సిమ్రన్ రెండు ఈవెంట్లలోనూ సిల్వర్ పతకాలు గెలిచింది. కంటిచూపుతో బాధపడేవారు టీ12 కేటగిరీలో పోటీపడుతుంటారు.




## రామాయణం' నుంచి రావణాసురుడిగా

# యశ్ అదిరిపోయే గ్లింప్స్..

### శివ తాండవ సోత్రంతో భీభత్సం




నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'రామాయణం' నుంచి మేకర్స్ దసరా పర్వదినం సందర్భంగా ఒక పవర్‌ఫుల్ మ్యూజికల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో రాక్‌స్టార్ యశ్ అత్యంత శక్తివంతమైన రావణాసురుడి పాత్రలో నటిస్తుండగా, రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ వీడియోలో యశ్ రావణుడి గెటప్‌లో కనిపిస్తూ తన ఇంటెన్స్ లుక్ మరియు భీకరమైన అభినయంతో అంచనాలను తారాస్థాయికి చేర్చారు.సుమారు రెండు నిమిషాల నిడివి గల ఈ వీడియోలో రావణుడి భక్తి, శివుడిపై అతనికి ఉన్న నిబద్ధతను ఎంతో గ్రాండ్‌గా చూపించారు. చేతిని కోసుకుని నుదుట త్రిపుండ్ర ధారణ చేయడం, శివుడి విగ్రహం ముందు హారతి ఇవ్వడం, ఆపై 'శివ తాండవస్తోత్రం' బ్యాక్‌గ్రౌండ్‌లో రావణుడు చేసే ఉగ్ర తాండవం ప్రేక్షకులను రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తున్నాయి. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించగా, డాక్టర్ కుమార్ విశ్వాస్ సాహిత్యం సమకూర్చారు. హిందీ వెర్షన్‌కు విశాల్ దద్లానీ తనత్రం అద్భుతమైన గాత్రం అందించారు. రవి దూబె లక్ష్మణుడిగా నటిస్తున్న ఈ భారీ పౌరాణిక చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## రెడ్ డ్రెస్‌లో మీనాక్షి చౌదరి అందాలు..

# ట్రెండీ లుక్‌లో అదరగొట్టిన భామ!







అందాల భామ మీనాక్షి చౌదరి మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఎరుపు రంగు దుస్తుల్లో మెరిసిపోతూ ట్రెండీగా కనిపిస్తున్న ఈ ముద్దుగుమ్మ ఫొటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సంప్రదాయ అందానికి ఆధునిక హంగులు జోడించినట్లుగా ఆమె లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. సినిమాలతో పాటు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్న మీనాక్షి చౌదరి, ఎప్పటికప్పుడు విభిన్నమైన వస్త్రధారణతో అభిమానులను అలరిస్తోంది. రెడ్ డ్రెస్‌లో ఆమె అందం, స్టైలిష్ పోజులు ఫొటోలకు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. ఈ ఫొటోలను చూసిన అభిమానులు తమదైన శైలిలో ప్రశంసలు కురిపిస్తున్నారు.

## భయపెట్టేందుకు వస్తున్న

# ప్రశాంత్ నీల్ '418'..

### - ఆసక్తికరంగా ట్రైలర్!




సౌత్ ఇండియన్ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త భయానక అనుభూతిని పంచేందుకు '418 -- ది నైట్‌మేర్ బిగిన్స్' సినిమా సిద్ధమవుతోంది. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సమర్పణలో వస్తున్న ఈ చిత్రానికి కీర్తన్ నడగౌడ దర్శకత్వం వహించారు. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై భారీ అంచనాలను పెంచేస్తోంది.ఈ సినిమా పూర్తిగా ఒక మెడికల్ కాలేజీ హాస్టల్ నేపథ్యంలో సాగుతుంది. సుమారు 15 ఏళ్లుగా ఎవరికీ ప్రవేశం లేని విధంగా మూసి ఉన్న '418' నంబర్ గది చుట్టూ అంతుచిక్కని రహస్యాలు, భయానక సంఘటనలు తిరుగుతుంటాయి. ఆ రూమ్ వెనుక ఉన్న అసలు మిస్టరీని ఛేధించేందుకు ప్రయత్నించే స్టూడెంట్స్‌కు ఎదురయ్యే ఊహించని భయానక అనుభవాలతో ఈ ట్రైలర్‌ను అత్యంత ఉత్కంఠభరితంగా రూపొందించారు. సాధారణ జంప్ స్కేర్లకు దూరంగా, చాలా ఇంటెన్స్‌గా మరియు గూస్‌బంప్స్ తెప్పించే విజువల్స్‌తో ఈ ట్రైలర్ హారర్ ప్రియులను కట్టిపడేస్తోంది. ముఖ్యంగా నటి చైత్ర ఆచార్ నటన మరియు ఆమె పలికించిన భయానక హావభావాలు ఈ సినిమాకి ప్రధాన బలంగా నిలవనున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. సాంకేతిక నిపుణుల పనితీరు ఈ చిత్రానికి పెద్ద ఎస్సెట్‌గా నిలిచింది. వెంకీ జీజీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మరియు దినేష్ దివాకరన్ సినిమాటోగ్రఫీ సినిమాలోని హారర్ మూడ్‌ను పర్ఫెక్ట్‌గా ఎలివేట్ చేశాయి. కథాకథనాలలో ఇంటెన్సిటీ ఎక్కువగా ఉండటంతో సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి 'ఏ' (యా) సర్టిఫికెట్ జారీ చేసింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించారు. పాన్-ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు పలు భాషల్లో ఈ సినిమా అక్టోబర్ 23న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

# 'సీన్' ప్రమోషన్స్ టైం

### -సూర్య టీం ఈవెంట్ ఎక్కడ ప్లాన్ చేసిందో తెలుసా..?




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ 'సీన్'. Suriya 47గా రాబోతున్న ఈ మూవీకి 'ఆవేశం' ఫేం జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా టైటిల్ టీజర్ కూడా రిలీజ్ చేయగా.. షార్ట్ అండ్ టీ షర్ట్‌లో నయా మేకోవర్‌లో కనిపిస్తూ స్టైలిష్ ఎంట్రీ ఇచ్చిఅదరగొట్టేస్తున్నాడు సూర్య. పోలీసాఫీసర్ భుజంపై చేయి వేసి జైలులో ఖైదీల మధ్య నుంచి నడుచుకుంటూ వస్తున్న సీన్లు.. మూవీలో సూర్యలోని నయా యాంగిల్‌ను చూపించబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తున్నాయి.ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషనల్ టైం వచ్చేసింది. సినిమా ప్రమోషనల్ ఈవెంట్‌ను ఈ సారి గ్రాండ్‌గా ప్లాన్ చేసింది సూర్య టీం. దుబాయ్‌లోని సిలికాన్ సెంట్రల్ మాల్‌లో గ్రాండ్ పబ్లిక్ ఈవెంట్‌ను నిర్వహించనుంది. అక్టోబర్ 25న సాయంత్రం 6 గంటల నుంచి ఈవెంట్ షురూ కానుంది. ఈవెంట్‌కు సూర్యతోపాటు చిత్రయూనిట్ సందడి చేయనుందట. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ యువ నటుడు నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. విభిన్నమైన యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మలయాళ సంగీత దర్శకుడు సుశిన్ శ్యామ్ పనిచేస్తున్నాడు.

## సింపుల్ లుక్‌తోనే మాయ చేస్తోన్న వైష్ణవి చైతన్య..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటి వైష్ణవి చైతన్య తన సింపుల్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. ఎక్కువ హంగులు లేకుండా సహజంగా కనిపిస్తూ అభిమానుల దృష్టిని తనవైపు తిప్పుకుంటోంది. సాధారణమైన వస్త్రధారణలోనూ ప్రత్యేకంగా కనిపించడం ఆమె స్టైల్‌లోని విశేషం. సినిమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులకు చేరువవుతున్న వైష్ణని చైతన్య, తనదైన వ్యక్తిత్వంతో గుర్తింపు తెచ్చుకుంటోంది. సహజమైన అందం, చక్కని చిరునవ్వుతో కూడిన ఆమె ఫొటోలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. సింపుల్‌గా కనిపిస్తూనే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న వైష్ణవి లుక్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831